# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నక్సల్ రహితంగా మారిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సోలార్ యూనిట్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.
- ❖ ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి సూచించారు.

========================

రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 50 వేల 893 మంది నిరుపేదలకు టిడ్కో గృహాలను అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తిరుపతి జిల్లా నాయుడుపేటలోని బిరుదవాడలో 2 వేల 064 టిడ్కో గృహాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 2029 నాటికి ఇళ్లు లేని పేదలకు గృహ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంకా 17 లక్షల పైచిలుకు ఇళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి 2 లక్షల ఇళ్లు, సెప్టెంబర్‌కు లక్షా 60 వేల ఇళ్లను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయిస్తామని చెప్పారు. అదే విధంగా రాష్ట్రంలో పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు కూడా ఇస్తామని చంద్రబాబు నాయుడు వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పుడు నక్సల్ రహితంగా మారిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు. నక్సల్ కార్యకలాపాల ద్వారా చేస్తున్న హింసను వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఏఓబీ రాష్ట్ర కమిటీ సభ్యుడు చెల్లూరు నారాయణరావు సహా మొత్తం తొమ్మిది మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి ఈరోజు తమ ఎదుట లొంగిపోయారని డీజీపీ విజయవాడలో పాత్రికేయులకు వెల్లడించారు. నారాయణరావుపై 25 లక్షల రూపాయల రివార్డు ఉండగా, మిగిలిన సభ్యులపై కూడా లక్షలాది రూపాయల రివార్డులు ఉన్నాయని చెప్పారు. లొంగిపోయిన వారికి తక్షణ సహాయంగా 20 వేల రూపాయలు అందజేయడంతో పాటు, వారి రివార్డు మొత్తాలను నేరుగా వారి ఖాతాలకే బదిలీ చేయనున్నట్లు తెలియజేశారు. వామపక్ష తీవ్రవాదం రాష్ట్రంలో ఇక ముగిసిందని డీజీపీ వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

========================

విజయనగరం కలెక్టరేట్ లో ఈరోజు జరిగిన 2026-27 బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలాల వారీ కేటాయింపులపై అవగాహన కల్పించారు. రాష్ట్ర బడ్జెట్ ను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమాలను రూపొందించుకోవాలని, నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి జిల్లాను ముందుకు తీసుకువెళ్లాలని కాంక్షించారు. ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన వినియోగపత్రాలను కూడా అందజేయాలని చెప్పారు. ఈ అవగాహన సదస్సులో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ రాం సుందర్ రెడ్డి, పలువురు శాసన సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సబ్ జైల్, విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్లను మంత్రి అనిత ఆకస్మిక తనిఖీ చేశారు.

========================

విశాఖపట్నంలో పర్యటిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పలు కార్యక్రమాల్లో ఈరోజు పాల్గొన్నారు. గాజువాకలో టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు స్థానిక శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఇళ్ల పట్టాలను అందించారు. మధ్యాహ్నం మధురవాడ వైజాగ్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన జీరో పావర్టీ P-4 కార్యక్రమం తొలి వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో మంత్రి మాట్లాడారు. జిల్లాలో లక్షా 05 వేల 186 బంగారు కుటుంబాలు గుర్తించగా.. వాటిలో 66 వేల 013 కుటుంబాలను దత్తత తీసుకున్నారని కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ మంత్రికి వివరించారు.

విరామం

========================

రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సోలార్ యూనిట్స్ ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వాడ గ్రామంలో "ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన"ను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈరోజు ప్రారంభించారు. అనంతరం మంత్రి రవికుమార్ విలేకరులతో మాట్లాడుతూ… అంబేద్కర్ జయంతి నాటికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 4 వేల కనెక్షన్ల వరకు ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దీనికి అవసరమైన నిధులు మంజూరు చేస్తోందన్నారు.

(వాయిస్ 28 సెకన్లు)

========================

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం" (PMIS) ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర

రెడ్డి సూచించారు. దేశంలోని అగ్రశ్రేణి సంస్థల్లో ప్రత్యక్షంగా పని చేసే అవకాశం కల్పించేందుకు ఉద్దేశించిన ఈ పథకం యువతకు మంచి భవిష్యత్‌ను అందిస్తుందని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం ప్రతి నెల 9 వేల రూపాయాల ఆర్థిక సహాయం అందించడంతో పాటు.. విధుల్లో చేరిన వెంటనే ఒకేసారి 6 వేల రూపాయల జాయినింగ్ గ్రాంట్ కూడా ఇస్తుందని చెప్పారు. ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా యువతకు అనుభవంతో పాటూ వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం లభిస్తుందని కలెక్టర్ వివరించారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా లేదా డిగ్రీ పూర్తి చేసి.. 18 నుంచి 25 ఏళ్ల లోపు వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ అయిన pminternship.mca.gov.inలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఒక పత్రికా ప్రకటనలో సూచించారు.

========================

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీ. జీ. భరత్ కర్నూలు నగరంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళాను ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 17 కంపెనీల్లో 1,125 ఉద్యోగాలను ఈ జాబ్‌మేళా ద్వారా భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. యువతీ, యువకులు తగిన నైపుణ్యాలతో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉద్యోగాలు సాధించిన యువత ఆ తర్వాత అదే కంపెనీలో స్థిరంగా ఉద్యోగం చేయాలని.. అవసరమయ్యే నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు.

========================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయం, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కిలోమీటర్లు వేగంతో వీస్తాయని పేర్కొంది.

========================

========================